క్లుప్తంగా

పథకాలు సద్వినియోగం చేసుకోండి

కూర్మన్నపాలెం : ప్రభుత్వ పథకాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే, టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సూచించారు. జీవీఎంసీ 87వ వార్డు సిద్దార్థనగర్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా స్పోర్ట్స్ కాంప్లెక్సు నిర్మించాలని యోచిస్తున్నామన్నారు. ఇప్పటికి సాధ్యమైందన్నారు. ముందుగా ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.1.55 కోట్లు మంజూరు చేశామని... గోడ పూర్తయిన తర్వాత మిగిలిన పనులు చేపడతామని ఆయన వెల్లడించారు. క్రీడల్లో ప్రతిభ చూపే యువతను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బి.జగన్నాథం, జోనల్ కమిషనర్ శేషాద్రి, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రయోజనాలు



ర్యాలీలో వైద్యాధికారి ప్రదీప్ ప్రసాద్‌రాజా, వైద్య సిబ్బంది

పెదగంట్యాడ : కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన జీఎస్టీ సవరణలతో ప్రజలకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్‌రాజా అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధి దేవాడ పీహెచ్‌సీ పరిసర ప్రాంతాల్లో గురువారం సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్‌పై స్థానికులకు అవగాహన కల్పించారు. ఆస్పత్రి సిబ్బంది, అగన్‌వాడీలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ 2.0 సవరణల్లో సుమారు 350కు పైగా వస్తువుల ధరలు తగ్గాయన్నారు. ప్రజలకు సాధారణ మందులు, తదితర వస్తువులపై జీఎస్టీని 12 నుంచి 5 శాతానికి తగ్గించారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఎం.శ్రీనివాసరావు, రెడ్డి రమణమ్మ, బి.విజయభాను, సూరాడ జ్యోతి, పూర్ణమణి, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా అమ్మవార్ల ఆలయ పునర్నిర్మాణ పనులు



ఆలయ పనులను పరిశీలిస్తున్న కమిటీ ప్రతినిధులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని నెల్లిముక్కులో వేంచేసిన పెంటమాంబ అమ్మవారి ఆలయ ఆవరణలో కొలువుదీరిన మహాశక్తి, భూలోకమ్మ, దుర్గాలమ్మ, కుంచుమాంబ, మరిడిమాంబ, శ్రీశక్తి అమ్మవార్ల ఆలయ పునర్నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు పులి వెంకటరమణారెడ్డి, గొందేశి సత్యారావు, ఎల్లేటి శ్రీనివాసరావు, గంట్యాడ పైడిరాజు, మొల్లి రమణ, పాల అప్పలరెడ్డి, పరదేశి, పెంటయ్యరెడ్డి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండగ నాటికి పనులు పూర్తి చేయనున్నామని తెలిపారు. ఉగాది నుంచి భక్తులకు దర్శనాలు కల్పిస్తామన్నారు. ఆలయాల నిర్మాణానికి భక్తులు, దాతలు సహకరించాలని కోరారు.

సృజనాత్మక ఆలోచనలతో మెరుగైన జీవనం



విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

అగనంపూడి: సృజనాత్మక ఆలోచనలు జీవిత గమ్యాన్ని మార్చేస్తాయని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్ అన్నారు. కాగ్నిజెంట్–యాస్టన్ మార్టిన్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి హ్యాకథాన్‌లో విజ్ఞాన్ నాల్గవ సంవత్సరం విద్యార్థి జి.జితిన్ ప్రథమ స్థానం, మూడవ సంవత్సరం విద్యార్థి హారిక రన్నరప్‌గా నిలిచి బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. జాతీయ స్థాయిలో కళాశాల పేరు ప్రతిష్టలు ఇనుమడింపజేశారన్నారు. విద్యార్థులు ఆలోచనా ధోరణి మార్చుకోగలిగితే జీవిత గమ్యం మారుతుందనడానికి వీరు ఉదాహరణ అన్నారు. కార్యక్రమంలో రెక్టార్ వి.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

చెల్లింపులు ఎన్నడో..?

- స్టీల్‌ప్లాంట్ నుంచి 464 మంది ఉద్యోగులకు వీఆర్‌ఎస్
- విధుల నుంచి వైదొలిగిన 9వ రోజున 25 శాతమే పరిహారం చెల్లింపు
- మిగిలిన మొత్తం వాయిదాల్లో చెల్లిస్తామంటున్న యాజమాన్యం
- గతంలో వీఆర్‌ఎస్ తీసుకున్న వారికి ఒకే విడతలో పరిహారం చెల్లింపు
- యాజమాన్యం తీరుపై వీఆర్‌ఎస్ ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి



స్టీల్‌ప్లాంట్ ముఖచిత్రం

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్‌ఎస్) ఉద్యోగులకు పూర్తి స్థాయిలో ఆర్థిక ప్రయోజనాల చెల్లింపులపై సందిగ్ధత నెలకొంది. వీఆర్‌ఎస్ తీసుకున్న రోజున పూర్తి చెల్లింపులు జరుగుతాయని భావించిన ఉద్యోగులకు తొమ్మిది రోజులకు 25 శాతం చెల్లింపులు జరగడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా పర్మినెంట్ ఉద్యోగుల తగ్గింపు, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. ఉద్యోగుల తగ్గింపు కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛంద పదవీ విరమణ పథకం (వీఆర్‌ఎస్)కు ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా మార్చి నెలలో అమలు చేసిన వీఆర్‌ఎస్ – 1లో 1100 మంది ఉద్యోగులు బయటకు వెళ్లిపోయారు. మార్చి 31న వెళ్లిన ఉద్యోగులకు అదే రోజు సాయంత్రం వీఆర్‌ఎస్ పరిహారం చెల్లించేశారు. అనంతరం విడతల వారీగా పీఎఫ్, గ్రాట్యుటీ, లీవ్ శాలరీలను కూడా అందజేశారు. దీంతో వీఆర్‌ఎస్ – 1 ఉద్యోగుల్లో ఆనందం కనిపించింది.

రెండో విడతలో 464 మందికి తీవ్ర నిరాశ

స్టీల్‌ప్లాంట్‌లో రోజురోజుకూ జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో చాలా మంది ఉద్యోగుల్లో అసంతృప్తి, కంపెనీ బాగుపడుతుందన్న నమ్మకం లేకుండా పోయింది. దీనికితోడు ఉక్కు యాజమాన్యం ఉద్యోగులకు 355 శాతం జీతం పెండింగ్ పెట్టింది. ఈ పరిస్థితుల్లో ఉక్కు యాజమాన్యం రెండో విడత వీఆర్‌ఎస్‌ను ప్రకటించింది. దీంతో సుమారు 1100 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో వడపోత అనంతరం 464 మంది ఉద్యోగుల వీఆర్‌ఎస్‌కు ఆమోదం తెలిపారు. సెప్టెంబర్ 30న వారికి ఆఖరి పని దినం కాగా అక్టోబర్ 1న అందుకు సంబంధించిన పత్రాలు అందజేశారు. ఆ రోజు పేమెంట్ వస్తుందని ఎదురు చూసిన ఉద్యోగులకు నిరాశే ఎదురైంది. కనీసం 3వ తేదీన అయినా చెల్లిస్తారని ఎదురుచూశారు. ఆ రోజు కూడా చెల్లింపులు జరగకపోవడంతో వారిలో ఆందోళన వ్యక్తమైంది. వీఆర్‌ఎస్ – 1 సమయంలో ఉద్యోగులకు చెల్లించినట్లే తమకూ ఉక్కు యాజమాన్యం చెల్లిస్తుందని భావించిన వారికి నిరాశే ఎదురైంది. విధుల నుంచి వైదొలిగిన తర్వాత తొమ్మిదో రోజున అక్టోబర్ 9న గురువారం కేవలం 25 శాతం పరిహారం చెల్లించడంతో ఆ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇలా చేస్తారనుకోలేదు..

వీఆర్‌ఎస్ – 1 రాక ముందు ఆర్థిక ప్రయోజనాల చెల్లింపులపై మాకు అనేక అనుమానాలు ఉండేవి. వీఆర్‌ఎస్ – 1 అమలు సమయంలో ఉద్యోగుల విధి నిర్వహణ చివరి రోజున పరిహారం మొత్తం చెల్లించేయడంతో మాకు నమ్మకం కుదిరింది. అందువల్లే రెండోసారి వీఆర్‌ఎస్ అమలు చేసినప్పుడు దరఖాస్తు చేసుకున్నాం. అయితే యాజమాన్యం మొత్తం పరిహారాన్ని సకాలంలో చెల్లించకపోవడం అన్యాయం. విడతల వారీగా కాకుండా ఒకేసారి పరిహారమిస్తే మా అవసరాలకు ఉపయోగపడుతుంది. యాజమాన్యం నిర్ణయాన్ని పున:పరిశీలించాలి.

– వీఆర్‌ఎస్ ఉద్యోగి, స్టీల్‌ప్లాంట్

నాలుగు వాయిదాల్లో చెల్లిస్తామనడంపై అసంతృప్తి

ఆర్థిక ప్రయోజనాల చెల్లింపుల్లో జాప్యంపై వీఆర్‌ఎస్ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కార్మిక సంఘాల నాయకులు, అధికార వర్గాలను వారంతా కలిసి విచారించారు. వారు యాజమాన్యం నుంచి తీసుకున్న సమాచారం మేరకు షాక్ ఇచ్చే వార్త వినిపించింది. పరిహారం ఒకే సారి కాకుండా వాయిదాల పద్ధతిలో చెల్లించనున్నట్టు సమాచారం తెలిసింది. 25 శాతం చొప్పున నాలుగు వాయిదాల్లో ఇవ్వనున్నట్టు కార్మిక వర్గాల సమాచారం. దీంతో వీఆర్‌ఎస్ తీసుకున్న ఉద్యోగులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. చివరి పని దినం నాడు చెల్లించాల్సిన మొత్తం పరిహారాన్ని వాయిదాల పద్ధతిలో చెల్లిస్తామనడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని వారంతా వేడుకుంటున్నారు.

42వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులు

ఉక్కునగరం: ఆర్టీసీ స్టీల్ సిటీ డిపో తరలింపును వ్యతిరేకిస్తూ నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 42వ రోజుకు చేరుకున్నాయి. డిపో లీజు గడువు ముగిసినందున ఆ స్థలాన్ని ఖాళీ చేయాలని, లేని పక్షంలో రూ. 130 కోట్లు డిపాజిట్‌తో పాటు అద్దె చెల్లించాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఆర్టీసీకి నోటీసు జారీ చేసింది. ఈ అంశంపై ఎన్ఎంయూ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. గురువారం డిపో ఆవరణలో జరిగిన దీక్షలో కార్మికులు ఎస్.వి. సత్య, ఎన్.వి. వీర, పి.ఎస్. బాబు, పి.ఎస్. నాయుడు కూర్చున్నారు. పలువురు కార్మికులు వారికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వ శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ–లీగల్ : జిల్లాలో 40 గంటల మధ్యవర్తిత్వ శిక్షణ కోసం అర్హులైన సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు, సబ్జెక్టు నిపుణులు నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. అర్హులైన అభ్యర్థుల జిల్లాలో గల సంబంధిత న్యాయవాదులు సంఘం నుంచి జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

పోషకాహారం.. వైద్య సలహాలతో సుఖ ప్రసవం



గర్భిణికి పోషకాహారం అందిస్తున్న రోటరీ క్లబ్ విశాఖ సౌత్ కమిటీ ప్రతినిధులు

అగనంపూడి: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉన్ననాడే పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.గోపీకృష్ణ అన్నారు. రోటరీ క్లబ్ విశాఖపట్నం దక్షిణ సారథ్యంలో వంద మంది నిరుపేద గర్భిణులు, బాలింతలకు అగనంపూడి ఆస్పత్రిలో ప్రొటీన్ పౌడర్, ఐరన్ టానిక్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు వైద్యుల సలహాలు పాటిస్తూ పోషకాహారం తీసుకోవడం ద్వారా సుఖ ప్రసవంతో పాటు పుట్టే బిడ్డలు ఆరోగ్యంగా, ఉంటారన్నారు. అలాగే తల్లులు కూడా వేగంగా కోలుకుని మామూలు స్థితికి చేరుకుంటారన్నారు. రొటేరియన్ పి.వై.నాయుడు కుటుంబ సభ్యులు వీటికి ఆర్థిక సహకారం అందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు వి.శివకుమార్‌రెడ్డి, ప్రతినిధులు జి.ఉమామహేశ్వరరెడ్డి, ఎ.మార్కండేయులు, తిప్పల నితీష్, బి.కొండలరావు, పల్లా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

జాబిలీ హిల్స్‌లో చోరీ

- వృద్ధురాలిని బెదిరించి బంగారం తస్కరణ



బాధితులను విచారిస్తున్న పోలీసులు

అగనంపూడి: దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధి గళ్లవానిపాలెం జాబిలీ హిల్స్‌లో వృద్ధురాలిని బెదిరించి ఒక దొంగ బంగారు నగలు తస్కరించుకుపోయాడు. రోడ్డు నంబర్ 1లో కె.అమ్మన్నమ్మ, అల్లుడు, కుమార్తెతో కలిసి ఉంటున్నారు. బుధవారం సాయంత్రం కుమార్తె షాపింగ్ కోసం గాజువాక వెళ్లగా, మనుమడు పైఅంతస్తులో నిద్రపోతున్నాడు. ఆ సమయంలో అమ్మన్నమ్మ ఒక్కరే ఇంట్లో ఉన్నట్లు గమనించిన దొంగ కత్తితో బెదిరించి ఆమె శరీరంపై ఉన్న బంగారు తాడు, గాజులు, చెవి దుద్దులు, రింగ్ వంటి దాదాపు ఆరు తులాల నగలను తస్కరించి పరారయ్యాడు. ఈ హఠాత్ సంఘటనతో స్పృహ కోల్పోయిన అమ్మన్నమ్మ తేరుకొని పక్కింటి వాళ్లకు విషయం దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాజువాక క్రైమ్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ మన్మథరావు ఘటనా స్థలానికి చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లిష్టతరమైన మూడు కేసుల్లో వైద్యుల ప్రతిభ



ముగ్గురు చిన్నారులతో వైద్య బృందం

గాజువాక : అత్యంత క్లిష్టతరమైన మూడు పీడియాట్రిక్ కేసుల్లో తమ వైద్య బృందం అత్యంత అప్రమత్తంగా వ్యవహరించి విజయం సాధించిందని స్థానిక సన్‌రైజ్ పిల్లల ఆస్పత్రి ఎండీ డాక్టర్ టి.తిరుపతి తెలిపారు. ఆస్పత్రిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మూడు కేసులకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఏడేళ్ల వయస్సు, 25 కిలోల బరువుతో రిపీట్ సీజర్స్, గ్రంటింగ్ రెస్పిరేషన్, నిమిషానికి 25 హార్ట్ రేటుతో స్వయంగా శ్వాస తీసుకోలేని స్థితిలో తమ ఆస్పత్రికి వచ్చిన బాలుడికి అరుదైన చికిత్స అందించి బాలుడు కోలుకునేలా చేశామని తెలిపారు. ఇది పిల్లల్లో చాలా అరుదుగా కనిపించే తీవ్రమైన డోంపెరిడోన్ విషతుల్యం (టాక్సిసిటీ) అని చెప్పారు. వైరల్ హిమరేజిక్ ఫీవర్ డెంగ్యూ జ్వరంతో చేరిన తొమ్మిదేళ్ల బాలుడు సడన్ సీజర్స్, మతిస్థిమితం కోల్పోవడం, తాత్కాలిక అంధత్వానికి గురయ్యాడన్నారు. ఇది అరుదుగా వచ్చే న్యూరోలాజికల్ క్లిష్టత అని పేర్కొన్నారు. నలుగురు సభ్యులతో కూడిన తమ వైద్య బృందం అరుదైన, సహేతుకమైన చికిత్స అందించి బాలుడు కోలుకునేందుకు కృషి చేసిందని తెలిపారు. ఐదేళ్ల బాలుడు జ్వరం అనంతరం అకస్మాత్తుగా అవగాహన కోల్పోవడం, బ్యాలెన్స్ లేమి, న్యూరోలాజికల్ లక్షణాలతో తమ వద్ద చేరాడని, ఆ బాలుడికి ఎంఆర్ఐ చేసి మల్టీ ఫోకల్ డిమైలినేటింగ్ లెసైన్స్‌ను గుర్తించామన్నారు. ఐదు రోజులపాటు శ్రమించిన తమ వైద్య బృందం బాలుడు కోలుకునేలా చేయడంతోపాటు మోటార్, న్యూరోలాజికల్ ఫంక్షన్‌ను పూర్తిగా తిరిగి పొందగలిగేలా కృషి చేశారన్నారు. సమావేశంలో వైద్యులు గణేష్ శంకు, బి.ప్రతిభ, జి.నవీన్, పి.సంతోషి తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయ వసతి గృహాలకు అండగా నిలవాలి



ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవంలో పాల్గొన్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తదితరులు

అల్లిపురం: స్వచ్ఛంద సంస్థలు నిరాశ్రయ వసతి గృహాలకు, పోలీసు డిపార్టుమెంట్‌కు అండగా నిలవాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా కేఎస్ఆర్ బ్యాడ్మింటన్ అకాడమీ సభ్యులు, ఎంపీపీ సెక్టర్–6, హెల్త్ ఎరీనా ప్రతినిధులు గురువారం నిరాశ్రయులకు నిత్యావసర సరుకులు సీపీ చేతుల మీదుగా అందజేశారు. నిరాశ్రయులకు బాసటగా నిలుస్తున్న ఏయూటీడీ లాంటి సంస్థలకు, పోలీస్ డిపార్టమెంట్‌కు దాతలు అండగా నిలవాలని సీపీ కోరారు. నిరాశ్రయుల దినోత్సవం రోజున సహాయం అందించిన అకాడమీ సభ్యులు సుందర రామరాజు బృందాన్ని అభినందించారు. దాతలను సమీకరించిన 2 టౌన్ సీఐ ఎర్రంనాయుడు, సిబ్బందిని అభినందించారు. నిరాశ్రయులు, షెల్టర్ సిబ్బంది, దాతలకు ధన్యవాదాలు తెలిపారు. అకాడమీ సభ్యులు జి.ఎస్.ఎన్ రాజు (బీఎస్ఎన్ఎల్), సత్యనారాయణ, చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

బధిరుల సమస్యలు, సేవలపై అవగాహన కార్యక్రమం

మహారాణిపేట: బధిరులకు ఎదురయ్యే సమస్యలు, వారి అవసరాలు, వారికి అందాల్సిన వైద్య సేవలపై గురువారం రేసవానిపాలెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఇంటర్నేషనల్ వీక్ ఆఫ్ డెఫ్ పీపుల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ హారిక అధ్యక్షత వహించారు. 'చూపులతో మాట్లాడే వారి కోసం మనం వినిపించాలి'అనే నినాదంతో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా సలహాదారు వి. లక్ష్మి ప్రత్యేక శిక్షణ అందించారు. ఎన్‌సీడీ మెడికల్ ఆఫీసర్లు, ఫిజియోథెరపిస్టులు పాల్గొన్నారు.

జగన్ చెంతకు జనం



ర్యాలీలో నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- అధినేతకు ఆత్మీయ స్వాగతం పలికిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

గాజువాక: నర్సీపట్నంలో మెడికల్ కళాశాల పరిశీలనకు విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు 70వ వార్డు కార్పొరేటర్, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు ఉరుకూటి చందు ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. గాజువాక నుంచి విశాఖ ఎయిర్ పోర్టు వరకు ర్యాలీగా తరలి వెళ్లిన కార్యకర్తలు ఎయిర్‌పోర్టు వద్ద జగన్‌మోహన్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు. ఎలమంచిలి అప్పారావు, బాబులునాయుడు, అచ్చిబాబు, పల్లా రమణ, రెహ్మాన్, బోర సోమునాయుడు, మొల్లి గోవింద్, అల్లావుద్దీన్, గొందేశి రమణ, చట్టి అప్పలరాజు, కుప్పిలి సత్యనారాయణ, ఆచారి, నాని, శివ, గణేష్, రాజ్యవరలక్ష్మి, రాములమ్మ, రమణమ్మ, సత్య, కనక, వాణి తదితరులు పాల్గొన్నారు.



అగనంపూడి నుంచి బయల్దేరిన 85వ వార్డు అధ్యక్షుడు పూర్ణ, నాయకులు

85, 88 వార్డుల నుంచి..

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జి.పూర్ణానందశర్మ (పూర్ణ) సారథ్యంలో వంద మంది నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా విశాఖ విమానాశ్రయానికి వెళ్లి మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డికి స్వాగతం పలికారు. నాయకులు నక్కా రమణబాబు, బోర సోము నాయుడు, యలమంచిలి అప్పారావు, గెద్దాడ అప్పలరాజు, ఏదూరి పైడిరాజు, గళ్ల అప్పారావు, తోటాడ చంద్రమౌళి, సిమ్మిటి గోవింద్ తదితరులు పాల్గొన్నారు. 88వ వార్డు వెదుళ్లనరవ నుంచి శ్రీనివాస్ పట్నాయక్, సర్వసిద్ధి బోరయ్యనాయుడు, చట్టి తాతారావు, పీటీ శ్రీను, సీహెచ్ కనకరాజు, పల్లా చిన్న, కెకె, వీటీఆర్, డి.నాగరాజు, ఎస్.అప్పలరాజు, ఎస్.అప్పారావు తదితరులు తరలి వెళ్లారు.



86వ వార్డు నుంచి రోడ్‌షోకు బైక్‌లపై వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

86వ వార్డు నుంచి..

కూర్మన్నపాలెం: మాజీ సీఎం జగన్ రోడ్డుషోకు జీవీఎంసీ 86వ వార్డు నుండి నాయకులు, కార్యకర్తలు బైకులపై ర్యాలీగా తరలి వెళ్లారు. ముందుగా రాజీవ్ నగర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి వార్డు అధ్యక్షుడు చేగొండి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాటూరి శ్రీనివాసరావు, మెడికల్‌బాబు, మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా శివాలయం ప్రారంభం



దేవతామూర్తుల విగ్రహాల ఊరేగింపులో భక్తులు, కమిటీ సభ్యులు

కూర్మన్నపాలెం : జీవీఎంసీ 87వ వార్డు కణితిలో శివాలయం గురువారం ఘనంగా ప్రారంభించారు. వేద పండితులు గణపతి పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, దీపారాధన చేశారు. అనంతరం దేవతా విగ్రహాలను ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటాలు, నృత్యాలు, భజన బృందాల పాటలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు, కణితి గ్రామ పెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ప్రధాన రహదారిలో ఉన్న రామాలయ ఆవరణలో శివాలయ ప్రారంభంతోపాటు విగ్రహాలు ప్రతిష్ఠించడంతో ఆ ప్రాంతమంతా భక్తులతో సందడిగా కనిపించింది.

సంపత్ వినాయగర్ హుండీల ఆదాయం రూ.22.21 లక్షలు

మహారాణిపేట : ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ దేవాలయం హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 33 రోజులకు గాను రూ.22,21,967, వెండి 153 గ్రాములు లభించిందని ఈవో, సహాయ కమిషనర్ ప్రసాదరావు, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ చోళస్ తెలిపారు. యుఎస్‌ఏ డాలర్స్ 76, కెనడా డాలర్స్ 10 వచ్చాయన్నారు. ఈవో కీర్తి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

సుప్రీంకోర్టు సీజేపై దాడి సరికాదు



ధర్నాలో ప్రసంగిస్తున్న ప్రకాష్

గాజువాక : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి యత్నాన్ని స్థానిక భెల్ కార్మికులు ఖండించారు. ఈ సంఘటనకు నిరసనగా నల్లబ్యాడ్జీలు ధరించి భెల్ మెయిన్ గేటు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రెస్ ఫ్రంట్ అధ్యక్షుడు జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని రాజ్యాంగంపై దాడిగా భావించాలన్నారు. దీనికి బాధ్యుడైన న్యాయవాదిని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మానికి అవమానం జరిగిందన్న పేరుతో ప్రధాన న్యాయమూర్తిపై మతోన్మాద న్యాయవాది ఒకరు కోర్టులో అందరూ చూస్తుండగానే బూటు విసిరి దాడికి ప్రయత్నించడం రాజ్యాంగానికి విరుద్ధమన్నారు. ఈ సంఘటనను అన్ని కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు ఖండించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సీతన్ననాయుడు, కె.నారపరెడ్డి, మురళీశ్వరరావు, కె.విజయ్ కుమార్, డి.నర్సింహారావు, జి.అచ్చన్ననాయుడు, జి.చిన్నబాబు, ఎస్.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు

విశాఖ–లీగల్ : వినియోగదారుల హక్కుల చట్టం ప్రజలకు న్యాయం అందించడానికి ఒక బలమైన సాధనం అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అన్నారు. గురువారం సిరిపురం వీఎంఆర్‌డీఏ మీటింగ్ హాలులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరులందరికీ వినియోగదారుల చట్టంపై అవగాహన అవసరమని, ముఖ్యంగా గ్రామీణ స్థాయిలో ప్రజలు తమ హక్కులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల ఫోరం–2 జడ్జి వెంకటేశ్వరి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఆర్. సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రచయిత్రుల జాతీయ సదస్సు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సత్యనారాయణ

కంచరపాలెం: సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో నిర్వహిస్తున్న రచయిత్రుల జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఏయూ హిందీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్. సత్యనారాయణ, రైటర్స్ అకాడమీ అధ్యక్షుడు, లీడర్ దినపత్రిక ఎడిటర్ వి.వి. రమణమూర్తి, విశిష్ట అతిథి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ప్రొఫెసర్ డాక్టర్ టి. సత్యనారాయణ రచయిత్రుల కృషిని అభినందించారు. సదస్సు కన్వీనర్, కళాశాల కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.కె. జయలక్ష్మి నేతృత్వంలో పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ద్వితీయ భాషా విభాగాధ్యక్షులు డాక్టర్ జె.నిర్మల, డాక్టర్ ఎస్.దీప్తి, డాక్టర్ కోటేశ్వరరావు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.